

కాంగ్రెస్ నేతల నిరసన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చితే సహించేది లేదని ఏపీ కాంగ్రెస్ పార్టీ ఆదివాసి చైర్‌పర్సన్ పాచిపెంట శాంతకుమారి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ, గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు లేని బోయ,వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని సిఎం జగన్మోహన్ రెడ్డి శాసనసభలో తీర్మానం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం ఈ నాలుగు సంవత్సరాలలో గిరిజన హక్కులు, చట్టాలకు తూట్లు పొడుస్తోందని విమర్శించారు. గిరిజన శాసనసభ్యులు హక్కులు, చట్టాలు కాపాడటంలో విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.మోహన్‌రావు, కె.పోతురాజు, భగత్రాం, మొస్య, ప్రేమ్ కుమార్, పి.చిన్నస్వామి, రఘు, భీమారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న నేతలు

వాకపల్లి బాధితులకు..

పూర్తి స్థాయిలో న్యాయం చేయాలి

▸ రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి ▸ ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జి మాడుగుల పోలీసు స్టేషన్ పరిధిలో 2007లో వాకపల్లి గ్రామంలో గ్రేహౌండ్స్ పోలీసులు గిరిజన మహిళలపై లైంగిక దాడి ఘటనలో నిందితులకు శిక్షపడకపోవడం విషాద ఘటనగా మిగిలి పోతుందని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సురేంద్ర విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ అసమర్థత, పోలీసు ఉన్నతాధికారులు నేరస్తులకు కొమ్ము కాయడమే దీనికి కారణమని ఆయన విమర్శించారు. కోర్టు తీర్పునుసరించి తక్షణ దర్యాప్తు జరపని పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలం జరిగిన విచారణ అనంతరం కోర్టు తీర్పు సందర్భంగా జడ్జి వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని తెలిపారు. దీన్ని గుణపాఠంగా తీసుకొని వేరే కేసుల్లో బాధితులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. పోలీసులే నిందితులుగా ఉన్న ఘటనలో పోలీసులనే దర్యాప్తు అధికారులుగా నియమించడం సమంజసం కాదన్నారు. అత్యాచారం చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆనాడు ఐక్య వేదిక ఆధ్వర్యంలో గిరిజన మహిళలు ఆందోళనలు చేసినప్పటికీ, దర్యాప్తు తీరు పట్ల పలు విమర్శలు వెల్లువెత్తినప్పటికీ, ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని వెల్లడించారు. సిబి సిఐడి పోలీసులు సరిగ్గా దర్యాప్తు జరపలేదని, నేడు కోర్టు కూడా అదే విషయాన్ని తీర్పులో తెలియజేయడం గమనార్హమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా దర్యాప్తు సక్రమంగా జరపని పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లైంగిక దాడికి పాల్పడిన గ్రేహౌండ్స్ పోలీసులను శిక్షించాలని, బాధిత మహిళలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనుల పట్ల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని సురేంద్ర కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్ ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేంద్ర

అధికారులపై చర్యలు తీసుకోవాలి : గిరిజన మహిళా సంఘం నాయకులు

పాడేరు: జి.మడుగుల మండలం వాకపల్లి ఘటనలో ఆధారాలు లేకుండా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ కేసులో ఆధారాలు లేకుండా చేసిన అధికారుల తీరును ఖండించారు. మండల కేంద్రంలో గిరిజన మహిళా సంఘం జిల్లా సెక్రటరీ ఏస్.హైమావతి, జిల్లా నాయకులు వివి జయ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, బాధితులకు న్యాయం చేయాలని ప్రజాసంఘాలు పోరాటాలు చేస్తే 24 గంటలలో ఆధారాలు దొరక్కుండా అధికారులు చేశారన్నారు. ఈ కేసులో దోషులకు శిక్ష విధించకుండా విచారణ పేరుతో కాలయాపన చేశారన్నారు. దోషులకు శిక్ష పడకుండా అధికార్లు పోలీసులను కాపాడి ఆధారాలు దొరక్కుండా జాగ్రత్త పడ్డారన్నారు. ఆధారాలు లేకుండా చేసిన అధికార్లు శివదర్ రెడ్డి, అనందరావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా చేసిన అధికారులను ఉద్యోగాల నుండి తొలగించి బాధిత మహిళకు న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న గిరిజన మహిళా సంఘం నాయకులు


జీడి పిక్కలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

దళారుల చేతిలో మోసపోతున్న జీడి రైతులు

వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధర ఇస్తున్న వైనం

ప్రజాశక్తి- కొయ్యూరు

దళారుల చేతిలో మండలంలోని జీడిపిక్కల రైతులు మోసపోయి నష్టపోతున్నారు. మండలంలో అనేక మంది రైతులు జీడి మామిడి సాగుపై ఆధారపడిన జీవిస్తున్నారు. వీరు పండించి సేకరించిన జీడి పిక్కలకు ఆశించిన స్థాయిలో ధర పలకటం లేదు. మండలల నుండి వేల టన్నులు జీడిపిక్కల రవాణా జరుగుతుంది. మైదాన ప్రాంత వర్తకులు నర్సీపట్నంలో బసవేసి దళారీల చేత గ్రామీణ ప్రాంతాలలో ఖరీదు చేయిస్తున్నారు. దళారులు సరైన ధర నిర్ణయించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల కాలంలో వర్తకులు సంఘాలుగా ఏర్పాటు చేసి బయట ప్రాంతల నుంచి వచ్చిన వర్తకులను కట్టడి చేశారు. దీంతో పలాస, ఒరిస్సా, కేరళ నుంచి వ్యాపారులు రాలేకపోతున్నారు. ఇక్కడి వ్యాపారులు రైతులకు సరైన ధర ఇవ్వడం లేదు. తొలుతగా 81 కేజీల బస్తా రూ.8,500 ధర ఉండగా, అది కాస్తా రూ.7,900కు పడిపోయింది. పక్క మండలాలైన రాజువొమ్మంగి, గొలుగొండ మండలం కేడీపేట ప్రాంతంలో రూ.8400కు ఖరీదు చేయగా కొయ్యూరు మండలంలో రూ.7900 మాత్రమే ఇస్తున్నారు. దీంతో మండలంలోని జీడి మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో టిడిపి నేతకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలం వట్టిగెడ్డ శివారున 516ఈ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో టిడిపి అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దంతులూరి శివరామచంద్రరాజు తీవ్ర గాయాలయ్యాయి. శివరామచంద్రరాజు జడ్డంగి నుండి రాజవొమ్మంగి వస్తుండగా ఒట్టుగడ్డ గ్రామ శివారున జాతీయ రహదారిపై వాహనం అదుపు తప్పి పడిపోవడంతో ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. ఇది గమనించిన స్థానికులు శివరామచంద్రరాజును రాజవొమ్మంగి పిహెచ్‌సికి తరలించగా వైద్యాధికారి లిఖిత ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారి పనులు చేపడుతున్న నేపథ్యంలో రహదారిలో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టర్లు హెచ్చరిక బోర్డులు, రాత్రి సమయంలో రేడియేషన్ స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.


హుకుంపేటలో శిలువలను చూపుతున్న క్రైస్తవులు

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి- హుకుంపేట: స్థానిక పరిశుద్ధ థామస్ ప్రార్థన మందిరంలో గుడ్ ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ధ్యానించారు. క్రైస్తవ సిలువను పట్టుకొని ప్రదర్శన చేపట్టారు. స్థానిక పాస్టర్ కే జేమ్స్ మాట్లాడుతూ, కల్వరి సిలువలో ఏసుక్రీస్తు చూపించిన త్యాగం, ప్రేమ, దయ గుణం కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక క్రైస్తవ సోదరులు, క్రైస్తవ సంఘ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

పాడేరు: గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రీస్తు ప్రార్థన మందిరాల్లో క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఉపవాస ప్రార్థనలతో పట్టణంలోని అన్ని చర్చిలలో క్రైస్తవులు ఆరాధన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఏసుక్రీస్తు సిలువలో చెప్పిన మాటలను పాస్టర్లు వివరించారు. సెయింట్ ఆన్స్ చర్చ్ ఫాదర్స్, సిస్టర్స్ సిలువతో చర్చి ప్రాంగణానికి ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని కారుణ్య చర్చ్, పలు ప్రార్థనా మందిరాల్లో పాస్టర్లు సందేశం ఇచ్చారు 8న ఉదయం పాడేరు పట్టణంలో రన్ ఫర్ జీసస్, 9న ఈస్టర్ సండే ఆరాధనకు క్రైస్తవ సహోదరులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

విఆర్.పురం :

మండలంలోని సంతపాకల వద్ద షాలోమ్ ప్రేయర్ హౌస్ మందిరంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ప్రత్యేక ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఉపవాస ప్రార్థనలతో మండలంలో అన్ని చర్చిలలో క్రైస్తవులు ఆరాధన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఏసుక్రీస్తు ఆత్మార్పణను, సిలువ వేయబడిన తర్వాత ఏసుక్రీస్తు మాటలను, మానవాళి శ్రేయస్సు కోసం క్రీస్తు చేసిన ప్రబోధనలను పాస్టర్లు డేవిడ్ సుదీర్ఘంగా వివరించారు. ఈ నెల 9న ఆదివారం ఈస్టర్ సండే ఆరాధన కార్యక్రమాల నిర్వహణకు మండలంలోని క్రైస్తవ సహోదరులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.


దెబ్బతిన్న రోడ్డు అంచులు

ప్రమాదకరంగా రోడ్డు అంచులు

-నిర్వహణ పనులు చేపట్టని అధికారులు

-ప్రమాదాల బారిన వాహనదారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు నుంచి పెదబయలు, ముంచంగిపుట్టు మీదుగా జోలాపుట్టు వరకు సుమారు 70 కిలోమీటర్ల తారు రోడ్డు ఉంది. రోడ్డు వేసేటప్పుడు రహదారికి ఇరువైపులా రోడ్డు బాగా ఎత్తుగా ఉన్నచోట అంచుల వద్ద రాతిపేర్పు చేసి, మట్టి పోసి రోలింగ్ చేయాలి. వర్షపునీరు రహదారులపై నుంచి ప్రవహించకుండా తగిన చర్యలు చేపట్టాలి. ఈ రోడ్డు నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్లు, అధికారులు వీటిపై పెద్దగా పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ముంచింగిపుట్టు మండల కేంద్రంలో ప్రతి శనివారం, పెదబయలు మండల కేంద్రంలో ప్రతి సోమవారం, పాడేరు మండలం సంతబయలులో ప్రతి గురువారం నిర్వహించే వారపు సంతలకు వ్యాపారులు, వినియోగదారులు అధిక సంఖ్యలో ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. ముంచింగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన ప్రజలు జిల్లా కేంద్రానికి ఆయా పనుల నిమిత్తం నిత్యం వచ్చి వెళుతుంటారు. పాడేరు నుండి వెళ్లే చింతలవీధి, గబ్బంగి, గుత్తులపుట్టు, మఠం తదితర ప్రాంతాల్లో రహదారులకు రెండు వైపులా అంచులు వర్షపు నీటితో కోతకు గురై గోతులు ఏర్పడ్డాయి. దీంతో, ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా ప్రమాదానికి గురికాక తప్పదు. రాత్రిపూట ప్రయాణాలు మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రతి సంవత్సరం వర్షాలకు మట్టి క్రమంగా కొట్టుకుపోతూ ప్రమాదకరంగా మారుతోంది. వర్షాలు పడినప్పుడు వాహనాల రాకపోకలకు మరింత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకునే సమయంలో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని వాహన చోదకులు చెబుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు అంచుల వద్ద రాతిపేర్పు చేపట్టి, మట్టి పోసి రోలింగ్ పనులు చేపట్టాలని పాడేరు, పెదబయలు, ముంచింగిపుట్టు మండలాలకు చెందిన ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



రోడ్డుపై నెమ్మదిగా వెళుతున్న బస్

ఉరుములతో భారీ వర్షం

- పిడుగుపాటుకు తెగిన కరెంట్ వైర్లు
- విద్యుదాఘాతానికి రెండు పాడి గేదెల మృతి


మృతి చెందిన రెండు గేదెలను చూస్తున్న స్థానికులు


సీలేరులో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం, సీలేరులో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఆకాశం మేఘావృతమై మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. అనంతరం ఉరుములు చిరుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా సీలేరు పరిసర ప్రాంతాల్లో చల్లటి వాతావరణం నెలకొంది. గత రెండు రోజుల నుంచి ఎండ తీవ్రతకి అల్లాడుతున్న ప్రజలు వర్షం కారణంగా ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు, చిత్రకొండ పరిసర గిరిజన గ్రామాల్లోనూ వర్షం కురవడంతో ఆయా ప్రాంతాల్లో గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతానికి రెండు పాడి గేదెల మృతి

శుక్రవారం ఉరుములు కూడి భారీ వర్షం కారణంగా పిడుగు పడి విద్యుత్ వైర్లు తెగి, విద్యుదాఘాటానికి గురై రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. జీకే వీధి మండలం సీలేరు కన్నబ్బాయి క్యాంపులో నివాసముంటున్న సియంది గోవిందరాజు తన పాడి గేదులను సీలేరు ఐటిఐ వెనుక భాగంలో మేతకు తోలాడు. శుక్రవారం మధ్యాహ్నం పెద్ద పెద్ద ఉరుములతో పడిన పిడుగు ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ డిస్కం లైన్ 250 ట్రాన్స్‌ఫార్మర్ ఎల్‌టి లైన్ విద్యుత్ తీగలపై పడి వైర్లు తెగిపడ్డాయి. ఆ సమీపంలో మేస్తున్న రెండు పాడి గేదులకు తెగిన విద్యుత్ తీగలకు తాకడంతో ఆ గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. అటుగా వస్తున్న ఓ యువకుడు గేదెలు మృత్యువాత గురైనట్లు గుర్తించి పశువుల యజమానికి సమాచారం అందించారు. గోవిందరాజు కుటుంబ సభ్యులతో సంఘటన ప్రదేశాన్ని చేరుకుని మృతి చెందిన రెండు పాడి గేదెలను చూసి బోరున విలపించాడు. రెండింటి విలువ లక్షా 20 వేల రూపాయలు ఉంటుందని బాధిడుతు తెలిపారు. పాలమ్ముకొని తమ కుటుంబం జీవిస్తుందని, గేదెలు చనిపోవడంతో జీవనాధారం పోయిందని, ప్రభుత్వమే తమను ఆర్థికంగా ఆదుకోవాలని గోవిందరాజు కోరారు.

నష్ట పరిహారం చెల్లింపునకు చర్యలు

పిడుగుపాటు విద్యుత్ వైర్లు తెగి, కరెంట్ షాక్‌కు గురై గేదెలు మృతి చెందిన నేపథ్యంలో పశువుల యజమానికి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని పశు వైద్య అధికారి రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మృత్యువాత గురైన పాడి గేదెలకు పోస్టుమార్టం నిర్వహించి సంబంధిత అధికారులకు నివేదిక అందజేసి, నష్టపరిహారం అందించే విధంగా చర్యలు చేపడతామని చెప్పారు.


ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

2 నెలలుగా నీరు రాక అవస్థలు

సిపిఎం అధ్వర్యాన ఖాళీ బిందెలతో ఆందోళన

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రాజుపేట పంచాయితీ పరిధి మొద్దులగూడెంలో మోటారు మరమ్మతుకు గురై రెండు నెలలుగా తాగునీరు రాక నానా అవస్థలు పడుతుంటే అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు విమర్శించారు. మోటారుకు మరమ్మతులు చేసి తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం అధ్వర్యంలో స్థానికులు శుక్రవారం ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, చిన్నబాబు మాట్లాడుతూ రెండు నెలల పాటు మోటారును ఎందుకు మరమ్మతు చేయలేదని ప్రశ్నించారు. వేసవిలో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కుంజా నాగిరెడ్డి, కుంజా కన్నయ్య, గుండెపూడి లక్ష్మణరావు, సొడి మల్లయ్య, చల్లా హజ్రత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభం


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని చెరుకుంపాలెం పంచాయతీ మర్రిపాలెం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధనలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల స్టిక్కర్లను గృహాలకు అంటించారు. గత ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు, నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాల గురించి వివరించి, ప్రజాభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం జరిగిందని, ఆ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి, వైస్ ఎంపీపీ సిహెచ్ చంద్రరాణి, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, దాసరి నాగేశ్వరరావు, వైసిపి నాయకులు సింగిరెడ్డి రామకృష్ణ, ఎ.రాంబాబు, ఎం.కమలాదేవి, ఎం పండు, వై చిన్న తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని రత్నంపేట గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పిటిసి వారా నూకరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, వైస్ ఎంపీపీ అప్పన వెంకట రమణ, వైసిపి మండల అధ్యక్షుడు జల్లి బాబులు, ఎంపీటీసీ బిడిజన అప్పారావు, సర్పంచ్‌లు ముసిలి నాయుడు, చంద్రరావు, వైసిపి నాయకులు బండి సుధాకర్, దోని బాబ్జి, పాటి శేఖర్, రీమల గంగాధర్, గాడి అచ్చిరాజు, గంగరాజు, వారా చిన నూకరాజు, పాటి గంగరాజు, ఎస్.కృష్ణ, కె.రవి పాల్గొన్నారు.

వేసవి సెలవుల నిబంధనలను అతిక్రమిస్తే
కాలేజీ గుర్తింపు రద్దు

ప్రజాశక్తి- సీతమ్మధార: వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ, కోచింగ్‌ల పేరిట ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలను తెరిస్తే కఠినచర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎపిఎస్‌సిపిసిఆర్) సభ్యులు గొండు సీతారాం హెచ్చరించారు. నిబంధనలకు అతిక్రమించి, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన వేసవి సెలవులను పాటించకుండా, ఇష్టానుసారం కళాశాలను తెరిస్తే తక్షణమే గుర్తింపు రద్దుతోపాటు శాశ్వతపరమైన ఇతర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించనున్నారు.

వాతావరణ శాఖ, వైద్య ఆరోగ్యశాఖల సూచనలకు విరుద్ధంగా అధిక ఉష్ణోగ్రతల మధ్య ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇప్పటికే రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పారావు సారథ్యంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, బాలల హక్కుల పరిరక్షణ విషయంలో కఠినంగా చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ ఆదేశాల అమలులో అలసత్వం వహించిన అధికారులను ఉపేక్షించబోమని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తమ ఫిర్యాదులను ఆధారాలతో పాటు కమిషన్ మెయిల్ apscpcr2018@gmail.com కు పంపించాలని సూచించారు. కాలేజీల యాజమాన్యాలు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో
గల్ఫ్ దేశాలలో ఉపాధికి శిక్షణ

ప్రజాశక్తి -కంచరపాలెం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ శిక్షణతోపాటు గల్ఫ్ దేశాలలో ఉపాధి అవకాశాలు కల్పనకు అర్హులైన 18-45ఏళ్ల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లాధికారి సాయిశ్రుత్ చైతన్య తెలిపారు. రాష్ట్రంలో పలువురు మహిళలకు ఉపాధి కోసం నకిలీ ఏజెంట్ల ద్వారా గల్ఫ్, ఇతర విదేశాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు.

ఇందులో భాగంగా రాష్ట్రంలో కడప, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు చోట్ల హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్‌టేకర్ అంశాలపై ఆసక్తి ఉన్నవారికి శిక్షణనిచ్చి, గల్ఫ్ దేశాల్లో ఉపాధి కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ విధానంలో ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారికి అక్కడ ఏదైనా సమస్య ఉత్పన్నమైనా, భారత రాయబార కార్యాలయం వాటికి బాధ్యత వహించి సహకరిస్తుందన్నారు. కనీసం పదో తరగతి చదివి, చదవడం, రాయడం తెలిసిన మహిళలు మాత్రమే అర్హులని, మరిన్ని వివరాలకు అసోసియేట్ మేనేజర్ కార్తిక్ 9494202677ను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సాయిశ్రుత్ చైతన్య సూచించారు.

వైభవంగా సింహాద్రి అప్పన్న ఉంగరం సేవ
- సందడిగా సాగిన వేడుక

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా గురువారం రాత్రి ఉంగరం సేవ వేడుకను అద్భుతంగా గందరగోళం, సందడి మధ్య భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామి విహారయాత్రకు వెళ్లగా, స్వామివారి ఉంగరం పోయిన ఘట్టాన్ని అద్భుతంగా భక్తిరంజకంగా జరిపారు. శుక్రవారం ఉదయం పోగొట్టుకున్న స్వామి ఉంగరం వెతుకులాట వేడుక సందడిగా సాగింది.

ఆలయానికి వచ్చిన భక్తులతోపాటు ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, ఆలయ ఉద్యోగులను దొంగల్లా పట్టుకుని, ఉంగరం కోసం అర్చకులు ప్రశ్నించే ఘట్టం ఉత్కంఠంగా సాగింది. ఇది నిజమేననుకుని స్వామి దర్శనానికి వచ్చిన గీతం కాలేజీ విద్యార్థులు, గుంటూరు నుంచి మొదటి పెళ్ళిపత్రిక స్వామికి సమర్పించడానికి వచ్చిన ఇద్దరు మహిళలు, ఇలా పలువురు తొలుత భయాందోళనలకు గురైనా, తర్వాత ఉత్సవంలో భాగంగా నిర్వహించే వినోద వేడుక అని తెలుసుకుని సంబరపడి ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరకు స్వామి ముసుగుల మధ్య పోగొట్టుకున్న ఉంగరం దొరికిన సన్నివేశంతో ఉంగరం సేవ వేడుకగా ముగిసింది. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు టిపి రాజగోపాల్, అర్చకులు సీతారామాచార్యులు, ట్రస్ట్ సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్ రాజ్, దేవస్థానం ఎఇఒ వై శ్రీనివాసరావు, ఇఇ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నవజాత శిశువుకు గుండె శస్త్ర చికిత్స విజయవంతం

★ విశాఖపట్నం కిమ్స్ కడల్స్ ఆసుపత్రి వైద్యుల ఘనత



గుండె ఆపరేషన్ చేసిన నవజాత శిశువును చూపుతున్న వైద్యులు

ప్రజాశక్తి -గాజువాక : పుట్టుకతోనే గుండె సంబంధిత అనారోగ్య సమస్యతో జన్మించిన నవజాత శిశువుకు పుట్టిన 30గంటలలోపే అరుదైన, సంక్లిష్టమైన గుండె శస్త్రచికిత్స చేశారు. కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో ప్రముఖ చిన్నపిల్లల గుండె శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ అనిల్‌కుమార్ ధర్మపురం నేతృత్వంలో వైద్యబృందం ఈ ఘనత సాధించింది. దీనికి సంబంధించిన వివరాలను కార్డియోథొరాసిక్ సర్జన్, చిన్నపిల్లల గుండె శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ అనిల్ కుమార్ వివరించారు.

యువజంటకు పుట్టిన శిశువుకు పుట్టుకతోనే అబ్‌స్ట్రక్టెడ్ టోటల్ ఎనామలస్ పల్మనరీ వీనస్ కనెక్షన్ (టిఎపివిసి) అనే అనారోగ్య సమస్య ఉంది. దీంతో శిశువుకు ఊపిరి అందక ఇబ్బంది పడుతున్న చిన్నారికి అత్యవసరంగా కడల్స్ ఎన్ఐసియూ (నియోనాటల్ ఐసియూ)లో చేర్చారు. డాక్టర్ నిఖిల్ తెన్నేటి నేతృత్వంలోని శిశువైద్య నిపుణుల బృందం శిశువును పరీక్షించి, గుండె సంబంధిత సమస్య ఉందని అనుమానించారు. చిన్నపిల్లల గుండె వైద్య నిపుణురాలు డాక్టర్ శాంతిప్రియ శిశువును పరీక్షించగా, టిఎపివిసి అనే సంక్లిష్టమైన గుండెసమస్య ఉందని నిర్ధారించారు.. దీని కారణంగా ఊపిరితిత్తుల నుంచి గుండెకు శుద్ధి చేసిన రక్తాన్ని తీసుకెళ్లే రక్తనాళాలు గుండెకు ఎడమవైపు కాకుండా కుడివైపు డ్రెయిన్ అవుతున్నాయని, ఇలా కుడివైపు కలిసే రక్తనాళాల దగ్గర ఒక పెద్ద బ్లాక్ ఉన్నట్లు గుర్తించారు. దానివల్ల గుండెకు రక్తసరఫరాకు ఆటంకం ఏర్పడి, ఊపిరితిత్తులపై ఒత్తిడి పెరిగి పల్మనరీ హైపర్ టెన్షన్ ఏర్పడిందని; ఫలితంగా శిశువుకు ఊపిరి అందకపోవడంతో శస్త్రచికిత్సకు ముందు వెంటిలేటర్ మీద పెట్టాల్సి వచ్చిందన్నారు.

నవజాత శిశువుకు గుండె సంబంధిత అత్యవసర మేజర్ ఆపరేషన్ అవసరమని గుర్తించి, టిఎపివిసి ఇంట్రా కార్డియాక్ రిపేర్ కోసం శస్త్రచికిత్స చేయాల్సి వచ్చిందన్నారు. కేవలం 30 గంటల వయస్సున్న శిశువు గుండె కణజాలాలు చాలా సున్నితంగా ఉండడంతో మత్తు ఇవ్వడం, ఇంటెన్సివ్ కేర్‌లో సంరక్షణ వంటి సాంకేతికపరంగా సంక్లిష్టం, సవాల్‌తో కూడుకున్న ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యులు వెల్లడించారు. శిశువును రెండు రోజులపాటు నియోనాటల్ యూనిట్‌లో ఉంచి, కోలుకున్నట్లు నిర్ధారించుకోవడంతోపాటు శిశువు పాలు కూడా తాగుతుండడంతో డిశ్చార్జి చేసినట్లు డాక్టర్ అనిల్‌కుమార్ వెల్లడించారు.

ఆసరాతో మహిళాభ్యున్నతి

వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి


మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న సుబ్బారెడ్డి, కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : వైఎస్సార్ ఆసరా తోనే మహిళాభ్యుదయం జరుగుతుందని ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. ఆసరా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉత్తర నియోజకవర్గం పరిధిలోని, డిఎల్‌బి క్రీడా ప్రాంగణంలో స్వయం సహాయక సంఘాలకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎంపీ ఎంవివి సత్యనారాయణ, ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైసిపి నగర అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబులతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళల ఆర్థికస్వావలంబనతోనే దేశాభివృద్ధి సాధ్యమని సిఎం జగన్ విశ్వసించడం వల్లే మహిళల పేరిట పలు సంక్షేమ పథకాలను అమలుపరుస్తున్నారన్నారు. ఉత్తర నియోజకవర్గం పరిధిలోని 3,223 డ్వాక్రా గ్రూపులలోని 33,249మందికి రూ.20.30 కోట్ల ఆసరా లబ్ధి వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ సిఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాలు నేరుగా ప్రజలకే అందుతున్నాయన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున మాట్లాడుతూ మహిళలు జీవనోపాధికి ఆసరా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.
ఎంపి ఎంవివి సత్యనారాయణ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతిహామీని అమలు చేసిన ఘనత సిఎం జగన్‌దేనన్నారు. నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు మాట్లాడుతూ, సిఎం జగన్ మహిళా పక్షపాతి అని, అందుకే సంక్షేమ పథకాలన్నీ వారి పేరునే అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పికెసిఆర్ చైర్మన్ చొక్కాకుల లక్ష్మి , డిప్యూటీ మేయర్ కట్టుమూరు సతీష్, మాజీ ఎమ్మెల్యే తైనాల కుమార్, బీసీ కార్పొరేషన్ సభ్యులు పక్కి దివాకర్, జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కంప హనోక్, సారిపిల్లి గోవింద్, అల్లు శంకరరావు, అనిల్ కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, బర్కత్ అలీ, ముర్రు వాణి, రొయ్యి వెంకటరమణ, వావులపల్లి ప్రసాద్, పి రమణకుమారి, వెంగళరావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపినాయుడు పాల్గొన్నారు.

హెటిరో పైప్‌లైన్ అనుమతులు రద్దు చేయాలి
- 490వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా శుక్రవారం 490వ రోజుకు చేరింది. శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ, పైపులైన్‌కు వ్యతిరేకంగా 490 రోజుల నుండి తామంతా శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం సమస్య పరిష్కారానికి మార్గం చూపక పోవడం దారుణమన్నారు. కంపెనీ వ్యర్థ జలాలను ఇప్పటికే వేసిన పాత పైప్‌లైన్ ద్వారా సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించి తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వేట సాగక పోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా పైప్ లైన్ ఏర్పాటు చేస్తే తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని ఆవేదన వెలిబుచ్చారు. మత్స్యకారుల జీవన విధానం దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా వేస్తున్న పైప్ లైన్‌కు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల స్వామి, పిక్కి రమణ, చేపల సోమేష్, బొంది నూకరాజు, ద్వైలపల్లి వీర్రాజు, మైలపల్లి నల్ల, మైలపల్లి జాను, మైలపల్లి వెంకటేష్, వాసపల్లి వెంకటేష్, కారే కోదండ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల హద్దులు గుర్తించాలి
- నర్సీపట్నం ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి -రావికమతం: సర్వే నిర్వహించిన గ్రామాలలో ముందుగా ప్రభుత్వ భూముల హద్దులను గుర్తించి సర్వే రాళ్లను వేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరామ్ సూచించారు. మండలంలోని గుమ్మాలపాడు గ్రామంలో ఫిల్లింగ్ చేస్తున్న సర్వే రాళ్ల విధానాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ, ఇప్పటికే సర్వే నిర్వహించిన గుమ్మాలపాడు, చినపాచీల, కవగుంట, తదితర గ్రామాలలో స్టోన్ సర్వే ఫిల్లింగ్‌ను వేగ వంతం చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ భూములకు, చెరువులకు సర్వే రాళ్లు ఆయా హద్దులలో వేయడం జరుగుతుందన్నారు. దీంతో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా ఉపయోగ పడుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తహసిల్దారు ఉమామహేశ్వరరావు, సర్పంచ్ బంటు సన్యాసినాయుడు, ఎంపీటీసీ బంటు శ్రీనివాసరావు, వీఆర్వో మురళి తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై అవగాహన కల్పించాలి
- ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ముత్యాలరాజు

ప్రజాశక్తి-మాడుగుల: ప్రస్తుతం జరుగుతున్న భూముల రీ సర్వే పట్ల రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు సూచించారు. శుక్రవారం మండలం లోని వీరనారాయణ గ్రామంలోని జరుగుతున్న రీ సర్వే పనులను పరిశీలించారు. సర్వే రాళు, తవ్వకాలు, ట్యాగ్ మార్కింగ్ వంటి పనులను పరిశీలించారు. భూమి హద్దులను సర్వే రాళ్లతో గుర్తించడం, కొలతలు బట్టి భూమి విస్తీర్ణం కొలవడం వంటి వివరాలను ఆయన పరిశీలించారు. ఆధునిక పద్ధతుల్లో జరుగుతున్న భూముల రీ సర్వేతో భవిష్యత్తులో రైతులు మధ్య ఎటువంటి వివాదాలకు అవకాశం ఉండదన్నారు. ఈ విషయాలు పట్ల రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సర్వేతో ఉపయోగాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, రెవెన్యూ అధికారులు చిన్నికృష్ణ, జయరాం, తహసీల్దార్ పీవీ రత్నం పాల్గొన్నారు.

ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రోలుగుంట: ఎండాకాలంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రోలుగుంట మండలం బుచ్చింపేట పిహెచ్‌సి వైద్యాధికారి సునీత సూచించారు. ఎండల్లో ఎక్కువగా తిరిగితే శరీరం అలసటతో డీహైడ్రేషన్‌కు గురవుతారన్నారు. ముఖ్యంగా చర్మ, కళ్ల సమస్యలు అధికంగా వస్తాయని తెలిపారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, తాజాగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ రోజుకి 5 నుంచి 6 లీటర్లు కాచి వడపోసిన నీటిని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా వీలైనంత వరకు బయట తిరగరాదని, వెళ్లాల్సి వస్తే తలకు టోపి, వస్త్రం ధరించాలన్నారు.


అభివాదం చేస్తున్న జెఎసి నేతలు

'పంప్డ స్టోరేజ్' నిర్వాసితుల హక్కులపై పోరాటం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో పంప్డ స్టోరేజీ ప్రాజెక్టు ఏర్పాటు వల్ల నిర్వాసితులైన వారి హక్కుల కోసం పోరాటానికే జేఏసీ ఏర్పడినట్లు జెఎసి నాయకులు స్పష్టం చేశారు. అంతే తప్పా తమ స్వార్థ ప్రయోజనాల కోసం జెఎసిని ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. జేఏసీ నాయకులను గిరిజనేతరుల ముఠాగా కొందరు అభివర్ణించడం తగదన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జేఏసీ నాయకులు కార్య శ్రీనివాస్, నక్క జ్ఞానేశ్వరరావు, ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లి ప్రసాద్ మాట్లాడుతూ తమ పూర్వీకులు జల విద్యుత్ కేంద్రం నిర్మాణంలో పాలు పంచుకున్నారని, అనంతరం కొంతమందికి ఉద్యోగాలు రాగా మరికొంతమంది వెళ్లలేక ఇక్కడే స్థిరపడి వ్యాపారులు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. వారికి పుట్టిన వారిమైన తాము, తమ బిడ్డలతో కాయకష్టం చేసుకుని జీవిస్తున్నామని పేర్కొన్నారు. మాలో గిరిజనులు, గిరిజనేతరులు అనే భావన ఎప్పుడూ లేదని కలిసే జీవిస్తున్నామని వెల్లడించారు. కొంతమంది వలస వచ్చిన వారు గిరిజనులు, గిరిజనేతరుల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలనుకోవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు నరసింహమూర్తి, వానపల్లి అప్పారావు, వెంకట్రావు, అంబిక పిలోన్ రాము, సన్యాసిరావు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి- మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెం పరిధి ఫోర్ బే రిజర్వాయర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం... మోతుగూడెం పోలీసు స్టేషన్ పరిధి ఒడియా క్యాంపు గ్రామం వద్దనున్న ఎపి జెన్‌కో పవర్ కెనాల్ వద్దకు ఈ నెల 4న ఉదయం 6 గంటల సమయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు పసుపు రంగు స్కూటీపై వచ్చారు. స్కూటీని రోడ్ మీద వుంచి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లారు. వారిలో ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు కెనాల్లో జారీ పడి మునిగిపోయాడు. మిగిలిన ఇద్దరు మూడో వ్యక్తి ఆచూకీ కోసం వెతికినా ఎంతకీ దొరక్కపోవడంతో వారు ఎవరికీ తెలియజేయకుండా అక్కడ నుండి వెళ్లిపోయారు. కెనాల్లో మునిగిపోయిన సదురు వ్యక్తి మృతదేహం శుక్రవారం ఉదయానికి ఫోర్ బే రిజర్వాయర్ వద్ద నీటిపై తేలుయాడుతున్న విషయాన్ని ఫోర్ బే గ్రామం వార్డు సభ్యుడు ప్రసాద్ చూశారు. దీనిపై మోతుగూడెం పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మోతుగూడెం పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వయసు 30 నుండి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఛాతిపై లవ్ సింబల్, ఎఎ అని పచ్చబొట్టు ఉందని, మృతుని వివరాలు తెలిసిన వారు మోతుగూడెం ఎస్ఐ 9440900757, చింతూరు సిఐ 9963534821 నెంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

735వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమిస్తామని కేంద్రం ప్రకటించాలని ఐఎఫ్‌టియు నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 735వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎఫ్‌టియు కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను కేంద్ర ప్రభుత్వం విరమిస్తున్నట్లు ప్రకటించాలని, సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులందరికీ శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, జయ, రాంబాబు, బి.భూషణం పాల్గొన్నారు.

ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యతగా ఉండాలి



సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యతగా ఉండాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా ఆరోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి తుర్లపాటి కామేశ్వరరావు అధ్యక్షతన కెజిహెచ్ ఒపి గేటు, జగదాంబ జంక్షన్‌లలో శుక్రవారం కార్యక్రమం చేపట్టారు. ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యతగా ఉండాలని, పెరిగిన మందుల ధరలను రద్దు చేయాలని, మందులపై జిఎస్‌టి ఎత్తేయాలని కోరుతూ ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా అధ్యక్షులు కె.శేషు, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ చైర్మన్ ఎర్ర శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి స్రవంతి నేతృత్వం వహించారు. సంతకాల సేకరణ ఉద్యమంలో డాక్టర్లు, పారా మెడికల్ స్టాఫ్, మెడికల్ రిప్రజెంటేటివ్స్, సిఐటియు నాయకులు, ప్రజలు భాగస్వాములయ్యారు. సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు తయారుచేసిన కళారూపాలు ప్రజలను ఆకర్షించాయి. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రజా ఆరోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన 'అందరికీ ఆరోగ్యం' నినాదం అమలుకావాలన్నారు. ప్రతి పౌరుడు జీవించి ఉన్నంత కాలం ఆరోగ్యంగా ఉండేలా ప్రభుత్వాలు బాధ్యత వహించాలని కోరారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి పెద్ద మొత్తంలో మంధుల ధరలు పెరిగిపోయాయని, 800 రకాల మందులపై 12.12 శాతం ధరలు పెరగడం ప్రజా ఆరోగ్యానికి ప్రమాదకరమని అన్నారు. బడ్జెట్‌లో ఆరోగ్యంపై కేటాయింపులను ఐదు శాతం పెంచాలని కోరారు. ఎపిఎంఎస్‌ఆర్‌యు జిల్లా కార్యదర్శి స్రవంతి మాట్లాడుతూ 40 సంవత్సరాలు వీరోచితంగా పోరాడి అత్యవసర, నిత్యవసర మందులను కంట్రోల్‌లోకి తీసుకొచ్చిన తరువాత ఆ మందులపై కూడా ధరలు పెంచడం దారుణమన్నారు. జిఎస్‌టి పెరగడం అన్యాయమన్నారు. ఇప్పటికే ప్రభుత్వ వైద్యం కుంటుపడుతోందని, ఇప్పటికైనా సర్కారు కళ్లు తెరవాలని ఆకాంక్షించారు. సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడుతూ ఇప్పటికే సామాన్యులకు వైద్యం అందుబాటులో లేకుండా పోయిందన్నారు. పిఎవి జిల్లా కార్యదర్శి కె.శేషు మాట్లాడుతూ ఆరోగ్యం ప్రజల హక్కు అని తెలిపారు. కార్యక్రమంలో చంద్రమౌళి, రాజేష్, హరి పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : నగరంలో గ్రీన్ క్లైమేట్ సంస్థ నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో విశ్రాంతి డిప్యూటీ తహశీల్దార్ తిరునగిరి సాయి ప్రకాష్ మాట్లాడారు. గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

జి 20తో జివిఎంసి ఖజానా ఖాళీ

అభివృద్ధి పనుల పేరిట నిధుల దుర్వినియోగం
ప్రజా ధనం వృథాపై బహిరంగ చర్చకు సిద్ధమా ?
వైసిపి పాలక వర్గానికి
సిపిఎం కార్పొరేటర్ గంగారావు సవాల్

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : జి 20 పనుల పేరిట ప్రజా ధనాన్ని జివిఎంసి దుర్వినియోగం చేసిందని, ప్రస్తుతం ఖజానా ఖాళీ అయిందని, దీనిపై వైసిపి పాలకవర్గం బహిరంగ చర్చకు రావాలని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. జి-20 సమావేశాల పేరిట జివిఎంసి ఆదాయంలో రూ.115 కోట్లకు పైగా దుర్వినియోగం చేసి గొప్ప అభివృద్ధి చేసినట్లు కమిషనర్, మేయర్ ప్రెస్‌మీట్‌లు పెట్టి సమర్థించుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

ప్రజల పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేయడంతో పాటు పెద్ద ఎత్తున అక్రమాలు, అవినీతి చర్యలకు పాల్పడ్డారన్నారు. జివిఎంసి చేసిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు రావాలని వైసిపి పాలక వర్గాన్ని ఆయన డిమాండ్ చేశారు. వాస్తవంగా జి-20 దేశాల సన్నాహక వర్కింగ్ గ్రూపు సమావేశాలకూ, జివిఎంసికీ ఎలాంటి సంబంధమూ లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమావేశాల ఖర్చును పూర్తిగా భరించాలని, కానీ జివిఎంసి మీద ఒత్తిడి తెచ్చి ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. సొమ్మొకరిది సోకొకరిది అన్నట్లు జివిఎంసి వ్యవహరించిందన్నారు. సుందరీకరణ, డివైడర్లు, సెంటర్ మీడియన్ల నిర్మాణం, పెయింటింగ్‌లు, బొమ్మలు, వ్యూపాయింట్లు, రాక్ పెయింటింగ్, చెట్లు తదితర వాటికి రూ.160 కోట్లకు పైగా దుర్వినియోగం చేశారన్నారు. గతంలో నరేంద్ర మోడీ విశాఖ వచ్చినప్పుడు కూడా దాదాపు రూ.30 కోట్లకుపైగా జివిఎంసి నిధులు ఖర్చు చేశారన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ పేర మరో రూ.30 కోట్లు నీళ్లపాలు చేశారన్నారు. ముఖ్యమంత్రి వచ్చినప్పుడల్లా పెద్ద ఎత్తున జివిఎంసి నిధులు ఖర్చు పెడుతున్నారని, దీంతో జివిఎంసి ఖజానా ఖాళీ అవుతోందని తెలిపారు.

మరోపక్క ప్రజల మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించడం లేదన్నారు. బాగా కమీషన్లు వచ్చే వాటిపైన, ప్రజలకు నిరుపయోగమైన వాటిపైన వాస్తవ అంచనాలపై రెండు రెట్లు అధికంగా చూపి అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మురికి వాడలు, కొండవాలు ప్రాంతాలు, విలీన ప్రాంతాలు, గాజువాక, అనకాపల్లి, పెందుర్తి, మధురవాడ ప్రాంతాలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. గడిచిన రెండేళ్లలో కోటి రూపాయల మేర అభివృద్ధి పనులు చేపట్టని వార్డులు సగం ఉన్నాయన్నారు.



వినోద్‌బాబును సన్మానిస్తున్న సిబ్బంది

ప్రిన్సిపల్ వినోద్‌బాబుకు సన్మానం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన వినోద్ బాబు విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయిన నేపథ్యంలో శుక్రవారం కళాశాలలో ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. వినోద్ బాబు 2022 నవంబర్ 19న సీలేరు కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టి, 2023 మార్చి 6 వరకు విధి నిర్వహణలో కొనసాగారు. అనంతరం ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు కమిషనర్ కార్యాలయంలో మార్చి 7 నుంచి 29 వరకు విధి నిర్వహించారు. తరువాత విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ చేస్తూ ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడంతో అక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సీలేరు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సాయిరాం, కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్ ఆధ్వర్యాన శుక్రవారం సన్మానించి వీడ్కోలు పలికారు.


దగ్ధమవుతున్న ఇల్లు

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని లబ్బర్తి గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకు ఇల్లు దగ్ధమైంది. లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించింది. గ్రామస్తుల కథనం ప్రకారం... లబ్బర్తి గ్రామంలోని సత్యవతికి చెందిన తాటాకు ఇంటిలో గ్యాస్ స్టవ్‌పై వంట చేస్తుండగా నిప్పురవ్వలు చెలరేగి ఇంటికి అంటుకున్నాయి. ఈ మంటలు ఇళ్లంతా వ్యాపించడంతో సత్యవతి భయంతో బయటకు పరుగులు తీసింది. గ్రామస్తులు మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా నీటితో ఆర్పి వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ అగ్ని ప్రమాదంలో సత్యవతి తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న తిండి గింజలు, గృహోపకరణాలు కాలిపోయాయి.

న్యాయం కోసం టవర్ ఎక్కిన దళిత రైతు

ప్రజాశక్తి - పెందుర్తి : ముదపాక పంచాయతీలో భూమి కోల్పోయిన తనకు న్యాయం చేయాలంటూ ఆ గ్రామానికి చెందిన దళిత రైతు ముదపాక రాము శుక్రవారం విద్యుత్ టవర్ ఎక్కాడు. 'సిఎం సార్.. ముదుపాక దళిత రైతుల భూములను కాపాడండి' అంటూ ఫ్లెక్సీ పట్టుకుని టవర్ పై నుంచే నినదించాడు. సమాచారం తెలుసుకున్న కుమారులు టవర్ దగ్గరకు వచ్చి తండ్రిని బతిమిలాడి కిందకు దించారు. ముదపాక పంచాయతీలో వైఎస్ఆర్ లే అవుట్ పేరుతో సర్వే నెంబర్ 76-1లో 3 ఎకరాలా 26 సెంట్లు భూమిని ప్రభుత్వం తీసుకొని ఎల్‌పిఒసి ఇచ్చి ఇంతవరకు భూమి చూపించకపోవడంతో ఆ రైతు మనస్తాపానికి గురై హై టెన్షన్ టవర్ ఎక్కాడు.